andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.2 కనిష్ఠం 24.5
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్
జిల్లా వార్తలు
ఆదివారం 3 మార్చి 2024


రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కమ్మర్‌పల్లి, మార్చి 2: కమ్మర్‌పల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజాశ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ఎంపీపీ లోలం గౌతమి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు, మండలంలోని వివిధ గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.



డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం!

- కాంగ్రెస్ నేతలతో టచ్‌లో కొంతమంది డైరెక్టర్లు
- ఒకటి, రెండు రోజుల్లో హస్తం గూటికి
- మెజార్టీకి సరిపడా డైరెక్టర్లు చేరగానే నోటీసు
- చైర్మన్‌ను కాంగ్రెస్ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నాలు
- పావులు కదుపుతున్న కాంగ్రెస్ జిల్లా నేతలు



నిజామాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులను పార్టీలోకి చేర్చుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నేతలు జిల్లా సహకార బ్యాంకుపైనా దృష్టిపెట్టారు. బ్యాంకుకు చెందిన డైరెక్టర్లను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతోపాటు చైర్మన్ పదవిపై కూడా అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి జిల్లా కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. అవిశ్వాసానికి అవసరమైన డైరెక్టర్లను పార్టీలో చేర్చుకున్న తర్వాత ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. మెజార్టీకి సరిపడా డైరెక్టర్లు చేరగానే అవిశ్వాసం నోటీసు ఇచ్చి చైర్మన్‌ను హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్లలో ఒకరిని నియమించేందుకు నిర్ణయం జరిగినట్లు తెలుస్తోంది. డీసీసీబీ డైరెక్టర్లు, చైర్మన్ పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఉంది. అయితే ఇంకా 11నెలలకుపైగా సమయం ఉండడంతో కాంగ్రెస్ నేతలు ఈ అవిశ్వాసానికి మొగ్గు చూపుతున్నారు. ఈనెలలోనే నోటీసు ఇచ్చి చైర్మన్‌ను తమ పార్టీకి చెందిన వారిని నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అసంతృప్తిలో డైరెక్టర్లు

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ సహకార బ్యాంకు కొనసాగుతోంది. కొత్త జిల్లాలు ఏర్పడినా బ్యాంకు డివిజన్ కాలేదు. బ్యాంకు పరిధిలో మొత్తం 20 మంది డైరెక్టర్లు ఉన్నారు. సహకార సంఘాలతోపాటు ఇతర సంఘాల నుంచి వీరు డీసీసీబీ డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. గత కొన్నేళ్లుగా సహకార బ్యాంకు బీఆర్ఎస్ చేతిలో ఉండటం ప్రస్తుతం మళ్లీ కాంగ్రెస్ చేతుల్లోకి తీసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ చేతిలో ఉన్న సహకార బ్యాంకు బీఆర్ఎస్ చేతిలోకి వచ్చింది. చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు బీఆర్ఎస్‌లో చేరారు. తర్వాత నాలుగేళ్ల క్రితం జరిగిన సహకార ఎన్నికల్లో డైరెక్టర్లు బీఆర్ఎస్‌కు చెందినవారే ఎన్నికయ్యారు. సహకార సంఘాల చైర్మన్లతో పాటు ఇతర సంఘాల చైర్మన్లు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. పోచారం భాస్కర్‌రెడ్డిని చైర్మన్‌గా, రమేష్‌రెడ్డిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అప్పటి నుంచి వీరి ఆధ్వర్యంలోనే పనులు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో బ్యాంకు ఆధ్వర్యంలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లతో పాటు రుణ పంపిణీ, ఇతర పనులను సహకార బ్యాంకు ఆధ్వర్యంలో చేపడుతున్నారు. దీర్ఘకాలిక రుణాల వసూళ్లు, ఇతర అంశాలపై వారు దృష్టిపెట్టారు. సమావేశాలతో పాటు కొన్నినిర్ణయాలు ఏకపక్షంగా తీసుకోవడం, రుణాల పంపిణీ, కొన్ని సహకార బ్యాంకుల పరిధిలోనే ఎక్కువగా కార్యకలాపాలు నిర్వహించడం వంటి అంశాలపై కొంతమంది డైరెక్టర్లకు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ వైపు డైరెక్టర్ల చూపు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కొంతమంది డైరెక్టర్లు ఆ వైపునకు వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు వారిని తమ పార్టీలోకి చేర్చుకునేందుకు సంప్ర దింపులు మొదలుపెట్టారు. వారి ఆధ్వర్యంలోనే ఒకటి, రెండు రోజుల్లో 12 మందికి పైగా చేరనున్నట్లు తెలుస్తోంది. అవిశ్వాసానికి నోటీసులు ఇచ్చేందుకు 11 మంది ఉంటే సరిపోతుంది. అవిశ్వాసం నెగ్గేందుకు మాత్రం 14మంది డైరెక్టర్లు అవసరం ఉంటుంది. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ పరిధిలో డైరెక్టర్లతో మాట్లాడి పార్టీలో చేర్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో బ్యాంకు ఉండటంతో తొమ్మిది నియోజకవర్గాల పరిధిలోని నేతలు ఆ ప్రయత్నాల్లో ఉన్నారు. వీరు కాంగ్రెస్ పార్టీలో చేరగానే అవిశ్వాసం పెట్టి కొత్త చైర్మన్‌ను ఎన్నుకోనున్నారని పార్టీ నేతలు తెలిపారు. అవిశ్వాసానికి ముందే ఎక్కువమంది సభ్యులను చేర్చుకునేందుకు పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తుండగా ఉమ్మడి జిల్లాలకు చెందిన డైరెక్టర్లు చేరేందుకు సిద్ధమవుతున్నారు. అయితే హస్తం గూటికి చేరేదెవరో ఒకటి, రెండు రోజుల్లో తేలే అవకాశం ఉంది. మొత్తంగా సహకార బ్యాంకు కూడా హస్తగతం కానుంది.



పార్లమెంటుపై బీఆర్ఎస్ దృష్టి!

- నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలపై బీఆర్ఎస్ నేతల ఫోకస్
- బీబీ పాటిల్ పార్టీ మారడంతో సమీక్షకు సిద్ధమవుతున్న నేతలు
- నిజామాబాద్ నుంచి పోటీకి ఎమ్మెల్సీ కవిత విముఖత
- ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం
- రెండ్రోజుల్లో అభ్యర్థులకు ప్రకటించే అవకాశం

నిజామాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాలపై బీఆర్ఎస్ నేతలు ఫోకస్ పెట్టారు. ఒకటి, రెండు రోజుల్లో సమీక్ష జరిపి అభ్యర్థులను నిర్ణయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో బలమైన నేతలను దించేందుకు సన్నద్ధమవుతున్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ బీజేపీలో చేరడంతో ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీకి దీటైన వ్యక్తిని దించేందుకు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్‌కు మాజీ ఎమ్మెల్యేలలో ఒకరిని బరిలోకి దించాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. బీసీ సామాజికవర్గానికి చెందిన నేత పట్ల మొగ్గుచూపుతున్నట్లు పార్టీ నేతలను బట్టి తెలుస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో కేడర్ కూడా ఉండడంతో గట్టి పోటీ ఇవ్వడంతో పాటు మెజార్టీ సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అభ్యర్థుల ఎంపికలో కసరత్తు

శాసనసభ ఎన్నికల తర్వాత ఓటమితో బీఆర్ఎస్ శ్రేణులు నిస్తేజంగా ఉన్నా పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ అందరినీ కలుపుకుని ఎన్నికలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు కీలక నియోజకవర్గాలున్నాయి. జహీరాబాద్‌లో బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎం పీ ఉండగా, ఆయన ఇప్పటికే బీజేపీలో చేరిపోయారు. బీఆర్ఎస్ ఈ స్థానాన్ని నిలుపుకునేందుకు పార్టీ నేతలతో కలిసి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పోటీ చేసేందుకు భాస్కర్‌రెడ్డి ప్రయత్నాలు


ఉమ్మడి జిల్లా పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాలు ఈ జహీరాబాద్ పరిధిలో ఉన్నాయి. వీటితోపాటు నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్ నియోజకవర్గాలు సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్నాయి.ఈ పార్లమెంట్ పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా, రెండింటిలో బీఆర్ఎస్, ఒక దానిలో బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. సిట్టింగ్ స్థానం కావడంతో మాజీస్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనయుడు, డీసీసీబీ బ్యాంకు చైర్మన్ భాస్కర్‌రెడ్డి పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బాన్సువాడ నియోజకవర్గం కూడా జహీరాబాద్ పరిధిలో ఉండడంతో ఆయన కేసీఆర్, కేటీఆర్‌ను కలిసి తనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. బీబీ పాటిల్ పార్టీ మారడంతో ఆయనకు అవకాశం రానున్నట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు. జహీరాబాద్ పరిధిలో భాస్కర్‌రెడ్డితోపాటు ఇతర నేతలు ఉన్నా పదవిలో ఉండడంతో ఆయన కే అవకాశం దక్కనున్నట్లు పార్టీ నేతలు చెప్తున్నారు.



పోటీ చేసేందుకు కవిత విముఖత

నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ కవిత విముఖత ఉన్నట్లు తెలుస్తోంది. ఆమెకు ఇంకా నాలుగేళ్ల పదవీకాలం ఉన్నందున మాజీ ఎమ్మెల్యేల వైపు పార్టీ నేతలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగు దఫాలు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయనకు జిల్లాతోపాటు పక్కనే ఉన్న జగిత్యాల జిల్లాలో కూడా పరిచయాలు ఉండడంతో ఆయనవైపు మొగ్గు చూపుతున్నారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త సోదరుడు మహేష్ బిగాల అభ్యర్థిత్వాన్ని కూడా పరిశీలిస్తున్నారు. బీసీ అభ్యర్థిని నిలబెడితే కలిసి వస్తుందని ఆ పార్టీ నేతలు బావిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో సమీక్ష సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ త్వరలో రానుండడంతో ఆలోపే నిర్ణయం తీసుకోనున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండడం వల్ల సామాజికవర్గం బలంగా ఉన్న నేతను నియమిస్తే కలిసివస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఈ వారంలో స్పష్టత రానుంది.





సిట్టింగులవైపే బీజేపీ మొగ్గు

- నిజామాబాద్ అభ్యర్థిగా ఎంపీ అర్వింద్‌కే టికెట్ ఖరారు
- జహీరాబాద్ అభ్యర్థిగా బీబీ పాటిల్
- మొదటి జాబితాలో సీటు ప్రకటించడంతో పార్టీ నేతల సంబరాలు

నిజామాబాద్, మార్చి2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీ అధిష్ఠానం సిట్టింగ్ ఎంపీల వైపే మొగ్గుచూపింది. నిజామాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ అరవింద్‌కే టికెట్ ఇచ్చింది. జహీరాబాద్ అభ్యర్థిగా ఎంపీ బీబీ పాటిల్‌ను ప్రకటించింది. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు రాష్ట్రం నుంచి పోటీ చేసే తొమ్మిది మంది అభ్యర్థులను బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. వచ్చేఎన్నికల్లో మెజార్టీ సీట్లను సాధించేందుకు దృష్టి పెట్టిన అధిష్ఠానం సిట్టింగ్‌లకే ప్రాధాన్యత ఇచ్చింది.

రెండోదఫా అర్వింద్‌కే టికెట్

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌కే బీజేపీ అధిష్ఠానం రెండోదఫా టికెట్‌ను కేటాయించి ంది. మొదటి జాబితాలోనే ఆయన పేరును ప్రకటించింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో అప్పటి సీఎం కూతురు కవితపై పోటీ చేసి ఎంపీ అరవింద్ గెలిచారు. ఆ తర్వాత పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి సీట్లు వచ్చేందుకు కృషిచేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టి పనిచేశారు. శాసనసభ ఎన్నికల్లో కోరుట్ల నుంచి పోటీచేసిన ఆయన కొద్ది తేడాతో ఓటమిపాలయ్యారు. పార్లమెంట్ పరిధిలో నిజామాబాద్‌అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా గెలిచేందుకు కృషిచేశారు. గత ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి దాని కోసం ప్రయత్నం చేశారు. శాసనసభ ఎన్నికలముందే జిల్లాకు వచ్చిన ప్రధాని పసుపు బోర్డును ప్రకటించారు. కేబినెట్‌లో తీర్మానం చేసి గెజిట్‌ను విడుదలచేశారు. పసుపు ఎగుమతులకు అనుమతులు ఇవ్వడంతో ధర కూడా పెరిగింది. గత నెలలోనే పార్టీ అధిష్ఠానం స్పష్టత ఇవ్వడంతో ఆయన పార్లమెంట్ పరిధిలోని అన్నినియోజకవర్గాల్లో కలియ తిరుగుతూ పనులు చేస్తున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను పూర్తిచేస్తున్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్రను కూడా పార్లమెంట్ పరిధిలో పూర్తిచేశారు. పార్టీ అధిష్ఠానంతో సత్సంబంధాలు కలిగి ఉండటం కేంద్ర హోంమంత్రితో ఎక్కువగా సన్నిహితంగా ఉండటంతో మొదటి జాబితాలోనే ఆయన సీటును ప్రకటించినట్లు తెలుస్తోంది.

బీబీ పాటిల్‌కే జహీరాబాద్ టికెట్

జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కే బీజేపీ అధిష్ఠానం టికెట్ ఖరారు చేసింది. జహీరాబాద్ ఎంపీగా రెండు దఫాలు బీఆర్ఎస్ నుంచి పనిచేసిన బీబీ పాటిల్ ప్రస్తుత పరిస్థితుల్లో కొన్నిరోజులక్రితం బీజేపీలో చేరారు. మహారాష్ట్ర నేతలతోపాటు ఢిల్లీ బీజేపీ నేతలతో సంబంధం ఉన్న ఆయనకు అధిష్ఠానం కూడా మొదటిజాబితాలోనే జహీరాబాద్ సీటును కేటాయించింది. లింగాయత్ సామాజిక వర్గంకు చెందిన ఓటర్లు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువగా ఉన్నారు. కర్నాటక, మహారాష్ట్రతో సంబంధాలు ఉండటంతో ఆయనకు బీజేపీ ఈ సీటును కేటాయించింది. దేశంలోనే పలుప్రాంతాల్లో కాంట్రాక్టర్‌గా తన సంస్థల ఆధ్వర్యంలో పనులుచేస్తున్న ఆయనకు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉండటం కూడా కలిసివచ్చినట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సీటు కోసం బీజేపీ నేతలు ఎక్కువమంది ప్రయత్నాల్లో ఉన్న రాష్ట్రంలో మెజార్టీ సీట్లను సాధించుకోవడంపై దృష్టిపెట్టిన బీజేపీ అధిష్ఠానం ఆయనవైపే మొగ్గుచూపింది. పార్లమెంట్ పరిధిలో లింగాయత్ సామాజికవర్గ ఓటర్లు 3లక్షల వరకు ఉండటం కలిసివస్తుందని భావించినట్లు తెలుస్తోంది.

బీజేపీ శ్రేణుల సంబరాలు

బీజేపీ మొదటి జాబితాలోనే ఎంపీ అభ్యర్థులుగా అర్వింద్‌తోపాటు బీబీ పాటిల్‌కు కూడా సీటు కేటాయించడంతో పార్టీ నేతలు సంబరాల్లో చేసుకుంటున్నారు. నిజామాబాద్ పార్టీ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఈ సంబరాలను నిర్వహించారు. పార్టీ నేతలు ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మార్చి2: పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా చేపడుతున్న ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం సీపీ కల్మేశ్వర్‌తో కలిసి కలెక్టర్ సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, భద్రత పరమైన ఏర్పాట్లు, అంతర్రాష్ట్ర సరిహద్దులు, జిల్లా సరిహద్దుల వద్ద చెక్‌పోస్టుల ఏర్పాటు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేసి వారికి శిక్షణ తరగతులను నిర్వహించడం తదితర అంశాలను సమీక్షిస్తూ సహాయ ఎన్నికల అధికారులకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. పోలింగ్‌కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏవైనా అనుచిత సంఘటనలు చోటుచేసుకున్న వాటిని, అసాధారణ రీతిలో ఓటింగ్ నమోదైన వాటిని సమస్యాత్మక జాబితాలో చేర్చాలన్నారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో సెక్టోరియల్ అధికారులకు శిక్షణ తరగతులు పూర్తి చేశామని మరోమారుఏఈ, ఆర్‌వోలస్థాయిలో సెక్టోరియల్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను నిర్దేశిత గడువులోపు అందించాలన్నారు. అంతర్రాష్ట్ర జిల్లా సరిహద్దుల వద్ద తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలకు కూడా శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి సీవిజిల్ యాప్, ఈ ఎస్ఎంఎస్ యాప్‌లను వారు ఇన్‌స్టాల్ చేసుకునేలా సూచించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ఆర్‌డీవోలు రాజేం దర్‌కుమార్, రాజాగౌడ్, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపాధరావు జయంతి

శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయం సముదాయ సమావేశమందిరంలో ప్రభుత్వపరంగా, అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

మహాశివరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని కలెక్టర్‌కు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాళేశ్వర్ వాసులు

నవీపేట,మార్చి2: మండలంలోని నాళేశ్వర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో జరిగే మహ శివరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును కోరారు. శనివారం వారు జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 8, 9వ తేదీలలో నాళేశ్వర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో మహ శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని వారు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ ఛైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, శివ తదితరులున్నారు.

పోలియోపై అవగాహన ర్యాలీ

బోదన్ రూరల్, మార్చి 2: ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీయోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీ నుంచి మూడు రోజులపాటు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగ పరుచుకొని 0 నుండి 5సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఈఓ రాములు, సూపర్ వైజర్ రాజేశ్వర్, ఏఎన్ఎం నర్సులు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నందిపేట: మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పల్స్ పోలియోపై అవగాహన కల్పించేందుకు మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు.

డొంకేశ్వర్: ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే పల్స్ పోలియోపై గ్రామాల్లో అవగాహన కల్పించి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేలా చూడాలని సూపర్‌వైజర్ సురేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

ఎర్గట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎర్గట్ల పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ మారుతి ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో



శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ

మెండోర, మార్చి2: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఎగువ ప్రాంతం మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తాగునీటి అవసరాల కోసం శుక్రవారం దిగువకు 0.6టీఎంసీల నీటిని విడుదల చేయడంతో శనివారం ఉదయం ప్రాజెక్టులోకి 6944క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరు తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఏడు వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 250క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 150క్యూసెక్కులు, అలిసాగర్,గుత్పకు 630క్యూసెక్కులు, సరస్వతికాలువకు 800క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 426క్యూసెక్కు లు, మిషన్ భగీరథకు 152 క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లో వెళ్తుందని తెలిపారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 1070.00అడుగుల (28.871టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని వివరించారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 201 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి చేరగా 193 టీఎంసీల నీటిని వరద గేట్ల ద్వారా ప్రధాన కాలువల ద్వారా విడుదల చేయడం జరిగిందని తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మాక్లూర్, మార్చి2: మండలంలోని ముల్లంగి, ధర్మోరా, కృష్ణనగర్ గ్రామాలలో ట్రైనీ కలెక్టర్ కిరణ్మాయి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముల్లంగిలో ఉపాధి హామీ పనులను ధర్మోరాలో నర్సరీ, వైకుంఠధామం, కృష్ణనగర్‌లో ఐకెపీ మహిళ కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఆమెతో పాటు డీఆర్‌డీవో, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

నవీపేట,మార్చి2: గ్రామాలలో ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని డీపీవో చక్రవర్తుల తరుణ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించాలని, గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి విషయాలలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి యోహన్, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, తదితరులున్నారు.

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసింది శూన్యం

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి,మార్చి2: తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధి శూన్యమని అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి పంచాయతీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 6గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి,200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం శనివారం ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారులు 200యూనిట్ల లోపు ఉండి 0 బిల్లు వచ్చే వారు 49లక్షల మంది వినియోగదారులు ఉన్నారని రూరల్ నియోజక వర్గంలో 47,710 లబ్ధిదారులు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. దివంగత సీఎం వైఎస్ఆర్ 2004లోనే రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందించారని గుర్తు చేశారు. 2024 లో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన 200యూనిట్ల గృహాలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయడం గొప్పవిషయమని హామీ ఇచ్చి అమ లు చేయడం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. ఇప్పటికే గ్యాస్ వినియోగ దారులకు రూ.500లకే సిలిండర్‌లు ఇచ్చే ప్రక్రియ జరుగుతోందని, 6గ్యారంటీల్లో 4 పూర్తి చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మేడారం సమ్మక్క సారక్క జాతరకు 16లక్షల మంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన మేడిగడ్డ మేడిపండులాగ తయారైందని నాణ్యత లోపంతో పిల్లర్లు కుంగి పోయాయని కాళేశ్వరం ప్రాజెక్టు పని రాకుండా పోయిందని, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలను ప్రజాధనం దుర్వినియోగం చేయడానికి నిర్మించారని వాటి వల్ల ఎక్కడ కూడా సాగు పెరగలేదని అన్నారు. రూరల్ నియోజకవర్గానికి3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూర య్యాయని అత్యంత నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గడిచిన 10ఏళ్ల కాలంలో ఒక్క ఇళ్లు కూడా నిర్మించాని బీఆర్ఎస్ కు ప్రజలు బుద్ధి చెప్పరని గుర్తు చేశారు. రాష్ట్రంలో పసుపు ను రైతులు ఎక్కువగా పండించడం లేదని అందుకనే ప్రస్తుతం పసుపు ధర పెరుగుతుందని దీనిని బాసటగా తీసుకొని బీజేపీ నాయకులు తమ ఘనత వల్లే పసుపు ధర పెరిగిందని చెప్పుకోవడం సిగ్గు చేటు అని అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సీజీఎం ఫైనాన్స్ రవీంద్రనాథ్, ట్రాన్స్‌కో ఏస్ఈ రవీందర్, డీఈ ఉత్తమ్ కుమార్ జాడే, ఏడీ శ్రీనివాస్ రావు, ఏఈ సాయిలు, డీపీవో చక్రవర్తి తరుణ్ తేజ్, డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఈవో కిషన్ రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు అమృతపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, శాంసన్, పులివెంకటేశ్వరరావు, డా.షాదుల్ల, వాసుబాబు, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో గృహజ్యోతి జీరో కరెంట్ బిల్లునువినియోగదారునికి అందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణిని అభినందించి ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఆర్మూర్‌రూరల్: సాఫ్ట్‌బాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టు గెలుపునకు కృషి చేసిన క్రీడాకారులను శనివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభినందించారు. ఇటీవల జరిగిన జూని యర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్ర బాలికల జట్టు బంగారు పతకం సాధించింది. ఆర్మూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన అజ్మీర ఇందును, శిక్షణ ఇచ్చిన పీడీ స్వప్నలను ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభినందించారు. భవిష్యత్ లో జాతీయ జట్టులో స్థానం సాధించి దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమ డింపజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ దణవేణి, గడీలరాములు, గంగామోహన్, వ్యాయమ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా కొనసాగిన మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అక్కపల్లి సుజాత

రుద్రూరు, మార్చి2:రుద్రూరు మండల సమీకృత కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ అక్కపల్లి సుజాత అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య, విద్య, విద్యుత్, తాగునీటి సరఫరా, పంచాయతీ రాజ్, ఇందిరాక్రాంతి, స్త్రీ మరియు శిశు సంక్షేమ, పశు పోషణ, ఉపాధిహామీ శాఖల అధికారులు హాజరై తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో అంగన్ వాడీ కేంద్రా లకు మంజూరు చేసిన నూతన భవనాల పనులు పూర్తి కానందున అసం పూర్తిగా ఉన్నాయని త్వరగా పూర్తి చేయాలని సూపర్ వైజర్ శ్రీలత విన్నవించారు. ఈసమావేశంలో ఆర్టీసీ, ఉద్యానవన శాఖ విభాగాల అధి కారులు గైర్హాజర య్యారు. ఈసమా వేశంలో ఎంపీడీవో సురేష్ బాబు, జడ్పీటీసీ నారోజీ గంగారాం, తహసీల్దార్ వెంకటేష్, ఎంపీవో సాయిలు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించాల్సిందే అంటున్న కళాశాలల యాజమాన్యం

● విద్యార్థుల వద్ద ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ బీఈడీ, డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ● కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

డిచ్‌పల్లి, మార్చి 2: దేవుడు వరమిచ్చిన పూజరి కరుణించాలేదనే చందంగా తయారైంది. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ బీఈడీ, డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి. యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు 2022 నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పోవడంతో వారి నుంచి కళాశాలల యాజమన్యాలు ముందస్తుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ రాకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అక్రమంగా వేలాది రూపాయలు ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారు. 2022-23 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం బీసీ,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ నేటికి రాకపోవడంతో కొన్ని ప్రైవేట్ కళాశాలలు అక్రమ ఫీజుల వసూళ్లకు తెరలేపారు. ఫీజులు పూర్తి స్థాయిలో విద్యార్థుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. లేదంటే పరీక్షల ఫీజు తీసుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. దీంతో విద్యార్థులకు వేరే గత్యంతరం లేక తల్లిదండ్రులను ఒప్పించి బయట నుంచి అప్పులు తీసుకొచ్చి కళాశాలలకు చెల్లిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు రావల్సిన రియింబర్స్‌మెంట్ చెల్లించలేదు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరగడం ప్రభుత్వం మారడం వేగంగా జరిగిపోయాయి. కానీ విద్యార్థులకు మాత్రం ఫీజు రియింబర్స్‌మెంట్ క్లియర్‌కాలేదు. నిజామాబాద్, కామా రెడ్డి జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోకి వస్తాయి.



వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల

ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ రాక పూర్తి స్థాయిలో యాజమన్యాలు ముందుగానే ఫీజులు వసూళ్లు చేస్తు విద్యార్థులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ముందుగా ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చాక విద్యార్థులకు ఇచ్చేస్తామని యాజమాన్యాలు అంటున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో నిరుపేద ఎస్సీఎస్టీబీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే యూనివర్సిటీ అధికారులు స్పందించి ఫీజు రియింబర్స్‌మెంట్ పేరిట అక్రమ వసూళ్లు చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వాహనంపై నుంచి పడి ఒకరి మృతి

వర్ని,మార్చి2: వర్ని మండలం బడాపహాడ్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీపేట మండలం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన జగ్గు రాజశేఖర్ మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. బడా పహడ్ పుణ్య క్షేత్రంలో బంధుమిత్రులతో కలిసి మొక్కులు తీర్చుకుని ఓ బోలేరో వాహనంలో తిరుగు ప్రయాణం అవగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. వాహన డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో వెనుక భాగాన కూర్చున్న రాజశేఖర్ వాహనం పై నుంచి అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. ఇదే ప్రమాదంలో ఉదయ్ అనే వ్యక్తి కింద పడడంతో తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,మార్చి2: మండల కేంద్రంలోని తడగామకు చెందిన కొండూరు సాయిలు(33)అనే వ్యక్తి శుక్రవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడి భార్య సోని రెండు రోజుల క్రితం తన భర్తతో గొడవ పడి తన రెండు సంవత్సరాల కుమారుడిని తీసుకుని మెట్‌పల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయిందని అన్నారు. గతంలో సాయిలుకు రెండు వివాహలు కాగా మొదటి ఇద్దరి భార్యలతో విడాకులు జరిగాయని, మూడవ భార్య సైతం తన పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపం చెందిన ఆయన తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడు గతంలో ఆటో డ్రైవర్‌గా పని చేయగా ఇటీవల కూలీ పని చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కందకుర్తి గోదావరిలో మృతదేహం లభ్యం

రెంజల్,మార్చి2: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో పాండుఫారానికి చెందిన ఓర్సు బాలమ్మ(32)అనే మహిళ గోదావరిలో శుక్రవారం స్నానం చేసేందుకు నీటిలో దిగిన సమయంలో ఎగువ నుంచి బాబ్లీ ప్రాజెక్టు నీరు రావడంతో గల్లంతు అయింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని జాలర్లతో వెతికించిన ఫలితం లేకుండా పోయింది. శనివారం ఉదయం మృతదేహం నీటిలో తేలిందని అటు గోదావరి వైపు వెళ్లిన వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ మృతదేహన్ని జాలర్ల సహయంతో బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతురాలి భర్త ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్స్ పంపిణీ

మోర్తాడ్, మార్చి2: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు శనివారం అవసరమయ్యే మెటిరియల్స్‌ను పలువురు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జక్కం నాగరాజు, మామిడల మనోహర్, సామ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పని సరిగా చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

డొంకేశ్వర్, మార్చి2: రేషన్‌కార్డు కలిగిన ప్రతిఒక్క లబ్ధిదారుడి వివరాలను ఈకేవైసీ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసేలా చూడాలని డొంకేశ్వర్ మండల తహసీల్దార్ వెంకటరమణ రేషన్‌డీలర్‌లకు ఆదేశించారు. డొంకేశ్వర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్‌లతో తహసీల్దార్ వెంకటరమణ సమావేశం నిర్వహించారు. రేషన్‌కార్డుల్లో ఆధార్ కార్డు వివరాలు సరిగ్గా నమోదు కానీ వారి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపించామని తహసీల్దార్ తెలిపారు. తమ పరిధిలోని కార్డుదారులకు ఈకేవైసీ చేసే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ వెంకటరమణను రేషన్‌డీలర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్, సంఘం నాయకులు రాజు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

నవీపేట,మార్చి2: మండలంలోని బినోలకు చెందిన గట్టు ముత్తెమ్మ (65)అనే వృద్ధురాలు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ప్రభు చరణ్, దేవదాస్ అనే ఇద్దరు కుమారులు, సుశీల అనే కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమారుడు ప్రభు చరణ్ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథాలో సభ్యుడిగా ఉన్నారు. ముత్తెమ్మ మృతదేహం వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న ఉద్ధేశంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్ మెడికల్ కళాశాలకు అప్పగించారు.ఈ సందర్భంగా ముత్తెమ్మ మృతదేహనికి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీ.ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి వెంకన్న, నాయకులు గంగాధర్, రాజేశ్వర్, సాయిరెడ్డి, సాయిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

యానంపల్లిలో క్షయ వ్యాధిపై సర్వే

డిచ్‌పల్లి, మార్చి 2: మండలంలోని యానంపల్లి గ్రామంలో క్షయ వ్యాధి నివారణాకు వైద్యాశాఖ అధికారులు ఇంటింట క్షయ వ్యాధి సర్వే ను శనివారం నిర్వహించారు. ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. దగ్గు, తీవ్రమైన జ్వరం ఉన్న వారికి తెమడ శాంపిల్స్ తీసుకొని వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని శంకర్ తెలిపారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీల్లో 19పంచాయతీ లు క్షయ రహిత గ్రామాలుగా ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, టీబీ కోఆర్డినేటర్ రవి గౌడ్, సూపర్‌వైజర్ పద్మ, ల్యాబ్ సూపర్‌వైజర్ స్రవంతి, ఆరోగ్య కార్యకర్తలు గంగుబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, మార్చి2: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జితేందర్‌రెడ్డి శనివారం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విదంగా నిజామాబాద్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఉర్దూ అకాడమి ఛైర్మన్‌గా నియామితులైన తాహెర్‌బిన్‌హందాన్ సీఎం నివాసానికి రాగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు

పంచాయతీల్లో పకడ్బందీగా పన్నులు వసూలు చేయాలి

● డీపీవో చక్రవర్తి తరుణ్ తేజ్



నడిపల్లిలో పన్నుల వసూళ్లపై ఈవోతో మాట్లాడుతున్న డీపీవో

డిచ్‌పల్లి,మార్చి 2: గ్రామాల్లో పంచాయతీ పన్నుళ్ల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు పన్నుళ్ల వసూళ్ల పై ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసుకోవాలని డీపీవో చక్రవర్తి తరుణ్ తేజ్ అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి పంచాయతీ కార్యాలయంలో పన్నుళ్ల వసూళ్లపై ఈవో నిట్టుకిషన్‌రావును ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరు పన్నుల వసూళ్లపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వేసవి దృష్ట్య తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు బోర్ల నుంచి వస్తున్న నీటి పరిస్థితులను గమనిస్తుండాలని సూచించారు. ఆయన వెంట డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, డీపీసీ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాజేశ్, పాల్గొన్నారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మార్చి2: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కౌంటర్ ఏర్పాటు

బోధన్ రూరల్, మార్చి 2: ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజాపాలన కౌంటర్‌ను ఎంపీవో సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని మండల ప్రజల సౌకర్యార్థం కౌంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి పంచాయితీ కార్యదర్శి భాస్కర్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులుగా తమ బాధ్యత నెరవేర్చాలి

జక్రాన్‌పల్లి, మార్చి2: విద్యార్థుల్లో చదువు పట్ల శ్రద్ధ, మనోధైర్యం, ఆత్మస్థైర్యం, సంకల్పబలం, పట్టుదల, మనో విజ్ఞానం పెరగాలంటే తల్లిదండ్రులుగా మనబాధ్యత నెరవేర్చాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో గ్రామప్రత్యేక అధికారి, ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యాసనాలకు అలవాటు కాకుండా తల్లిదండ్రులు గమనించాలన్నారు. సమాజంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్య, సంస్కారం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సంతోష్, ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్, వ్యాయమ ఉపాధ్యాయుడు సంకేపల్లి గంగాధర్, అశోక్, సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు జీరో బిల్ అందజేత

ఆర్మూర్‌టౌన్,మార్చి2:పట్టణంలోని రాంనగర్‌కాలనీలోవిద్యుత్ డీఈ హరిచందర్‌నాయక్ శనివారం లబ్ధిదారులకు జీరో బిల్లులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా 200 యూనిట్లు వరకు వినియోగించుకున్న లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీధర్, ఏఈ మనిష, జేఏవో హరిష్, ప్రకాష్, ప్రభాకర్ తదిత రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన తహసీల్దార్

కోటగిరి,మార్చి2: కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం తహసీల్దార్ సునీత తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది విధి నిర్వహణ సక్రమంగా లేకపోవడం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధిఆరులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్ల పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

ఏర్గట్ల, మార్చి 2:మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యాబోధనలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు చేయగా అనంతరం వారికి పాఠశాల హెచ్ఎం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు గణేష్, లక్ష్మీ ప్రసన్న, అనిత, మాజీ ఛైర్మన్ చిన్న చిన్నయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో గంజాయి పట్టి వేత

● ఒకరి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ స్టీవేన్‌సన్

డిచ్‌పల్లి/ఆర్మూర్‌రూరల్, మార్చి2: ఆర్మూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సీఎంజీ ఆసుపత్రి సమీపంలో గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎక్సైజ్ సీఐ స్టీవేన్‌సన్ తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా బైక్‌పై అనుమానా స్పదంగా వెళ్తున్న గరుకుల పవన్‌కళ్యాణ్‌ను పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి ముఠా లభించిందన్నారు. అతని వద్ద లభించి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రవా ణాపై విచారించగా నిజామాబాద్‌లోని గృహ కల్ప కాంప్లెక్స్ హసద్ బాబానగర్ నందిగుట్ట ప్రాంతాల నుంచి కొనుగోలు చేశానని, ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తుంటానని వెల్లడించారని ఆయన తెలిపారు. తనిఖీల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌లు ప్రమోద్‌చైతన్య, చంద్రమౌళి, ఎక్సైజ్ సిబ్బంది ధర్మేందర్, వికాస్, సంతీప్, సాయిబాబా, శ్రీనివాస్, మోహన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు మొక్కను అందజేస్తున్న మార గంగారెడ్డి

సీఎంను కలిసిన మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి

నిజామాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపాటి హన్మంత్‌రావు ఆధ్వర్యంలో ఆయన సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరనున్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేస్తున్న ఆయన బీఆర్ఎస్ పార్టీ అనుసరిస్తున్న నిర్ణయాలు, ఓటమి తర్వాత సమీక్ష లేకపోవడం వంటి కారణాలతో పార్టీని వీడేందుకు నిర్ణయం తీసుకున్నారు. దానిలో భాగంగానే ఆయన సీఎంను కలిశారు. ఆయనతోపాటు జిల్లా సహకార బ్యాంక్‌కు చెందిన కొంతమంది డైరెక్టర్లు కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు.

సీఎంను కలిసిన తాహెర్‌బిన్ హుందాన్



సీఎంను కలిసిన తాహెర్‌బిన్ హుందాన్, జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి2: రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్‌గా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాహెర్‌బిన్ హుందాన్, జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ విప్ అనిల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తదితరులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్‌గా తనను నియమించినందుకు ఆయన సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా శ్రీపాదరావు జయంతి

రుద్రూరు, మార్చి2: రుద్రూరు మండల సమీకృత కార్యాలయంలో శనివారం మాజీ స్పీకర్ దివంగత దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కపల్లి సుజాత, జడ్పీటీసీ నారోజీ గంగారాం, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంపీవో సాయిలు, షేక్ మస్తాన్, ఎంఈవో శాంతకుమారి, ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మాజీ స్పీకర్ శ్రీ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పీకర్ పదవికి వన్నె తెచ్చారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఎంపీవో మధుకర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డీఐఈవో

నవీపేట,మార్చి2: మండలకేంద్రంలోని మోడల్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని డీఐఈవో రఘురాజ్ శనివారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా శనివారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్ నిర్వహించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

అంబేద్కర్‌నగర్ జీపీని సందర్శించిన డీఎల్‌పీవో

రెంజల్, మార్చి2: మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం డీఎల్‌పీవో సాయిబాబా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సునీల్‌ను అడిగి గ్రామంలోని తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వేసవిని దృష్టిని ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించారు. నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శి సునీల్‌కు సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సాయిబాబా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీపీ

ఖిల్లా, మార్చి2: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్లకు నిర్వహించిన మేళాలో పలు అంశాలను వారికి వివరించారు. రౌడీషీటర్ల దినచర్యలను, వారి రాకపోకలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వారు ఇప్పటి వరకు ఎవరెవరిని కలిశారు, ఎందుకోసం కలుస్తున్నారు, భవిష్యత్తులో ఎలాంటి అల్లర్లకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారనే విషయాలను తెలుసుకున్నారు. రౌడీషీటర్లు ప్రతిరోజు ఉద్యోగం నిర్వహిస్తూ ఇంటివద్దనే ఉండాలని ఏ తగాదాల్లో పాల్గొనరాదని, ప్రధాన కూడళ్లలో సమావేశాలు నిర్వహించకూడదని, రాత్రి సమయాల్లో హోటళ్ల వద్ద, పాన్ షాపుల వద్ద ఉండరాదని తెలిపారు. ప్రతి రౌడీషీటరు తమ నడవడికను మార్చుకోవాలని లేనియెడల వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరైనా వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించకుండా సమాజంలో ఉద్రిక్తతలను రేపు విధంగా వ్యవహరించరాదని తెలిపారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు, పీడీ యాక్టులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొహిబీషనరీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ఏసీపీలు ఎల్. రాజావెంకటరెడ్డి, బస్వారెడ్డి, పి.శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి, గృహజ్యోతి వర్తించని వారికి మరో అవకాశం

ధర్పల్లి, మార్చి2: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు వర్తించని వారికి మరోఅవకాశం కల్పించారు. ప్రజాపాలనలో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తు చేసుకుని ప్రస్తుతం ఈ పథకాలు వర్తించలేని వారికి ఈనెల 4 నుంచి మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం వర్తించని వారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఎలక్ట్రిసిటీ సర్వీస్ కనెక్షన్ నెంబర్‌ను జత చేసి మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారికి తెలిపారు. 200 యూనిట్ల జీరోబిల్లు రానివారు కరెంట్ మీటర్ నెంబరు, మహాలక్ష్మి కింద రూ.500 సబ్సిడీ సిలిండర్ రానివారు గ్యాస్‌కనెక్షన్ నెంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్‌నెంబర్ ఇవ్వాలని అధికారులు సూచించారు. ఈ అవకాశం కేవలం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని పథకం వర్తించని వారికోసమేనని అధికారులు పేర్కొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారికి ఈ అవకాశం వర్తించదని వారు వెల్లడించారు.



మాట్లాడుతున్న విఠల్‌రావు

ఘనంగా మహిళా అంతర్జాతీయ సెక్స్‌వర్కర్ల హక్కుల దినోత్సవం

నిజామాబాద్ అర్బన్, మార్చి2: మహిళా అంతర్జాతీయ సెక్స్‌వర్కర్ల హక్కుల దినోత్సవాన్ని శనివారం మారుతినగర్‌లోగల స్నేహసొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై గతంలో జోగినిల వ్యవస్థ ఉండేదని కాలక్రమేనా సెక్స్‌వర్కర్లుగా పేరుమార్పిడి జరిగిందని కానీ ఆ పదం సరైనది కాదని అన్నారు. పొట్టకూటి కోసం వారు ఈవృత్తిని ఎంచుకుంటున్నారని వారిని చిన్నచూపు చూడవద్దని దేవుడు బిడ్డలుగా ఆదరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ డైరెక్టర్ సిద్దయ్య, దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



రథంపై ఊరేగుతున్న అనంతపద్మనాభ స్వామి

వైభవంగా అనంతపద్మనాభస్వామి రథోత్సవం

● పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

నిజామాబాద్ రూరల్, మార్చి2: భక్తుల కీర్తనలు, భక్తిపాటలతో లక్ష్మీసమేత అనంత పద్మనాభస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. శనివారం పూలహారాలతో పల్లకీలో అలంకరించిన లక్ష్మీ అనంతస్వామి ఉత్సవ విగ్రహాలను రథోత్సవాన్ని జరిపారు. మల్కాపూర్ (ఎ) అనంత పద్మనాభస్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా ఐదవ రోజైన శనివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు రథంపై ఊరేగుతున్న స్వామిని దర్శించుకుని పులకరించిపోయారు. మల్కాపూర్ (ఎ), లక్మాపూర్ గ్రామా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. రథం ముందు కొబ్బరికాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు. అనంత పద్మనాభస్వామి లక్ష్మీసమేతంగా పుష్పకవిమానంపై భక్తులకు దర్శనమిచ్చారు. గుట్టపై నుంచి సాయంత్రం 4 గంటలకు లక్ష్మీసమేతంగా స్వామివారు గుట్ట కిందివరకు ఊరేగింపుగా తరలివచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రథోత్సవంలో భక్తులతోపాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌లు పాల్గొన్నారు. రథాన్ని భక్తులతోపాటు తాడును లాగి తమ భక్తిని చాటుకున్నారు. ఈ ఉత్సవానికి ఆలయ కమిటీ, వీడీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

అయోధ్యకు వెళ్లే ప్రత్యేక రైలును ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దబజార్, మార్చి 2: ఇందూరు నుంచి అయోధ్యకు వెళ్లే రెండో విడత ప్రత్యేక రైలును అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్తా ప్రత్యేక రైల్లో అర్బన్ నుంచి 352మంది, పార్లమెంట్ పరిధి నుంచి 1500 మంది బయలు దేరారని ఆయన తెలిపారు. వారికి భోజనంతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. అయోధ్యలో అడుగుపెట్టిన దగ్గర నుంచి దర్శనం చేయించి మళ్లీ రైలు ఎక్కేవరకు పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వం, రైల్వే సిబ్బంది, ఆలయ సిబ్బంది చూసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు దినేష్ కులాచారి, బీజేపీ నాయకులు న్యాలంరాజు, పంచరెడ్డి ప్రవళిక, సుధీర్, హరీష్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఐదేళ్ల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

● నిండు జీవితానికి పోలియో చుక్కలు తప్పనిసరి: డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం ● నగరంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దబజార్, మార్చి2: నేడు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని డీఎంహెచ్‌వో డాకర్ సుదర్శనం కోరారు. శనివారం నగరంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో పోలియో దినోత్సవం పురస్కరించుకొని జెండా ఊపి పల్స్‌పోలియో ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 4, 5 తేదీలలో ఇంటింటికీ పల్స్‌పోలియో చుక్కలు తప్పిపోయిన పిల్లలకు ఐదు సంవత్సరాలల పిలల్లందరికీ వేయాలని అన్నారు. ఈ పోలియో చుక్కలను ప్రతి గ్రామంలో పోలియో చుక్కల కేంద్రాలలో, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ప్రభుత్వ వైద్య కళాశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, బస్టాండ్, రైల్వేస్టేషన్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. జిల్లాలో ఐదేళ్ల పిల్లలు లక్షా 91వేల 81మంది ఉన్నారని, వీరికి 1007 పోలియోబూత్‌లు, 37 ట్రాన్సిట్ బూత్‌లు, 37 మొబైల్ టీమ్‌ల ద్వారా పోలియోచుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు 4277 టీమ్ మెంబర్స్, 100 సూపర్‌వైజర్లు, 1212 ఆశావర్కర్లు, 2007 అంగన్‌వాడీ టీచర్ల ద్వారా పోలియోచుక్కల కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2లక్షల 40వేల పోలియో చుక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, తుకారం రాథోడ్, గంగాధర్, వెంకటేశ్వర్లు, స్వామి, ప్రభుత్వ జనరల్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సబిత, కళాశాల విద్యార్థిని విద్యార్థులు, ఆరోగ్య కేంద్ర, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మార్చి2: 2024-25 విద్యాసంవత్సరానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్, రామాంతపూర్‌లలో ఒకటవ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి ఎస్టీ ముగ్గురు బాలురు, బాలికలకు మొత్తం ఆరు సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 సాయంత్రంలోగా దరఖాస్తులను జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. బాలబాలికలు 1 జూన్ 2017 నుంచి 31 మే 2018 మధ్య జన్మించి ఐదేళ్లు నిండి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారు 2లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారు లక్షా 50వేలు మించరాదని, ఆదాయ, కుల, పుట్టినతేదీ, నివాస ధృవీకరణ పత్రాలు మీసేవా ద్వారా జారీ చేసినవి ఉండాలని పేర్కొన్నారు. లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు.

ఇంటర్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతం

నిజామాబాద్ అర్బన్, మార్చి 2: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-2 పరీక్షకు మొత్తం 16,215 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 15,788 మంది హాజరుకాగా 427 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి మాస్‌కాపీయింగ్ కేసు నమోదు కాలేదు. డీఈసీ కమిటీ 5, హెచ్‌పీసీ కమిటీ 6, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 30, డీఐఈవో రఘురాజ్ 8 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

● ఇంటర్ వాల్యుయేషన్ క్యాంప్ అధికారికిగా రవికుమార్

నిజామాబాద్ ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం అధికారిగా రవికుమార్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు నియమించింది. ఈనెల 31తో ప్రస్తుత డీఐఈవో రఘురాజ్ ఉద్యోగ విరమణ చేయనుండటంతో మూల్యాంకన క్యాంప్ అధికారిగా రవికుమార్‌ను నియమించారు. ప్రస్తుతం ఆయన పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఆయనను పూర్తిస్థాయి మూల్యాంకన కేంద్రం అధికారిగా నియమించారు.

బీసీ అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1కు ఉచిత కోచింగ్

నిజామాబాద్ అర్బన్, మార్చి 2: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన బీసీ అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ఉచిత కోచింగ్ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7లోగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని నిజామాబాద్‌లో ని సుభాష్‌నగర్‌లోగల ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ రెండవ అంతస్తు భవనంలో దరఖాస్తులను నేరుగా అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ మెమోలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, గ్రూప్-1 దరఖాస్తు కాపీ, సూచించారు.



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో విద్యారణ్య స్వామి, పండితులు

హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషిచేయాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి2: హిందూధర్మ పరిరక్షణకు ప్రతీఒక్కరు కృషి చేయాలని జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య స్వామి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని నడి ఊరు చావిడి వద్ద నూతన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలలో ఉండాలని, పాడి పంటలు చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచంలో హిందూ ధర్మం గొప్పదని, ధర్మ రక్షణకు యువత కృషి చేయాలని అన్నారు. ప్రతీరోజు దేవాలయాల ప్రదక్షిణలు చేయాలని, అనుకున్న కోరికలు నెరవేరుతాయని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ గ్రామకమిటీ అధ్యక్షుడు జాగా రెడ్డి, కులసంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.



కలశ స్థాపన చేస్తున్న స్వామిజీ

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,250	రూ.59,250	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆపరేషన్ వాలెంటైన్ (11.00, 1.55, 4.50, 7.45, 10.40),
స్క్రీన్-2 : దునే పార్ట్2 (ఇంగ్లీష్) (10.05) చారి 111 (1.35, 10.10) వ్యూహం (4.25) భూతద్దం భాస్కర్ నారాయణ (12.10)
స్క్రీన్-3 : భూతద్దం భాస్కర్ నారాయణ (12.10) దునే పార్ట్2 (ఇంగ్లీష్) (3.10, 6.40, 10.10),
స్క్రీన్-4 : ఇంటి నెంబరు 13 (1.05) కిక్ (3.50) ఆర్టికల్ 370 (హిందీ) (7.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : వ్యూహం (10.55) ఊరుపేరు భైరవకోన (1.30) సమరసింహారెడ్డి (1.30) ఆపరేషన్ వాలెంటైన్ (4.30)
స్క్రీన్-2 : చారి 111 (11.00) హనుమాన్ (1.30, 4.30), వ్యూహం (7.30) కిక్ (10.30)
స్క్రీన్-3 : మా ఊరి రాజారెడ్డి (10.30), ఆపరేషన్ వాలెంటైన్(1.30), భూతద్దం భాస్కర్ నారాయణ (4.20, 10.20), ఊరుపేరు భైరవకోన (7.20)

దేవి : ఆపరేషన్ వాలెంటైన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : సమర సింహారెడ్డి (11.00, 9.15), కిక్ (2.15, 6.15)
నటరాజ్ : ఇంటి నెంబరు - 13 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్